# మత్స్యశాఖను ఆదర్శంగా తీర్చిదిద్దాం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్
- హైటెక్స్‌లో ఆక్వాఎక్స్‌పో ఇండియా -2019 ప్రారంభం
- మూడు రోజులపాటు కొనసాగనున్న ప్రదర్శన

సమైక్య రాష్ట్రంలో ఎవరూ పట్టించుకోని మత్స్యశాఖను స్వరాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సొసైటీ ఆఫ్ ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్ (సిఫా), తెలంగాణ మత్స్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మాదాపూర్ హైటెక్స్‌లో గురువారం 'ఆక్వాఎక్స్‌పో ఇండియా-2019' మొదలైంది. మూడ్రోజులపాటు సాగే ఈ కార్యక్రమాన్ని మాజీ మంత్రి తలసాని గురువారం ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఒక్క తెలంగాణలోనే ఉచితంగా చేప, రొయ్య పిల్లలను పంపిణీ చేసి చూపెట్టారు. మత్స్యకారులకు 75 శాతం రాయితీపై లైట్ మోటార్ వెహికిల్స్, ద్విచక్రవాహనాలు సరఫరా చేశామని, ఇతర సదుపాయాల కోసం రూ.1000 కోట్లు ఖర్చు చేస్తున్నామని తలసాని వివరించారు. కోటి ఎకరాలకు నీరు ఇవ్వడంతోపాటు, నీరున్న ప్రాంతాల్లో చేపలు పెంచాలనే ఆలోచనతో సీఎం కేసీఆర్ ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరం, ఎల్లంపల్లి, దేవాద-కొర్ల, పాలమూరు ఎత్తిపోతలు, డిండి, సీతారామ ప్రాజెక్టులు ఈ ఏడాది నుంచి పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తాయని తెలిపారు. ఆక్వా విస్తరణకు భవిష్యత్‌లో ఉజ్వలమైన అవకాశాలున్నాయని చెప్పారు. చేపల ఉత్పత్తితో పాటు వాటికి మార్కెట్ సౌకర్యం కూడా ఉండాల్సిన అవసరం ఉందని మత్స్యశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. ఇలాంటి ఎక్స్‌పోల వల్ల చేపల పెంపకం దారులకు, ఆక్వా రంగానికి ప్రయోజనకరంగా ఉంటుందని మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ తెలిపారు. ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్ ప్రపంచస్థాయి ట్రేడ్ అండ్ టెక్నాలజీ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించడం ఇక్కడి మత్స్యకారులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. భారత ఫిషరీస్, ఆక్వాకల్చర్ కోసం ఒక అంతర్జాతీయ వేదికను ఏర్పాటు చేయడం ఆక్వాఎక్స్‌పో ఇండియా-2019 లక్ష్యంగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. భారతదేశంలో చేపల పెంపకం ఈ మధ్య కాలంలో పెరుగుతున్నా.. కొత్త సాంకేతికత, కొత్త జాతులు, శ్రేష్ఠమైన పరికరాలు, యంత్రాలు వినియోగించకపోవడంతో ఉత్పత్తి, ఉత్పాదకత ఆశించిన స్థాయిలో లేదని సీఫా అధ్యక్షుడు రామచంద్రరాజు అన్నారు. కార్యక్రమంలో మేనేజ్ డైరెక్టర్ జనరల్ ఉషారాణి, నిర్వాహకులు రాజు, వేణు, సమీర్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం మాదాపూర్ హైటెక్స్‌లో 'ఆక్వాఎక్స్‌పో ఇండియా ప్రదర్శనను జ్యోతివెలిగించి ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్